# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో ఇసుకను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, త్వరలోనే కొత్త ఇసుక విధానం-2024 అమల్లోకి తీసుకువస్తామని ప్రకటించింది.**
2. **యువతకు అధునాతన పరిజ్ఞానం ఎంతో కీలకమని.. దాన్ని సమగ్రంగా అందించేలా నైపుణ్య విశ్వవిద్యాలయం నెలకొల్పాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు.**
3. **ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు కల్పించడం, తద్వారా పేదరికం లేని రాష్ట్రమే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రైతు బజార్లలో కందిపప్పు కిలో 160 రూపాయల చొప్పున విక్రయిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**
5. **తెలంగాణలో కొత్త సామాజిక పింఛన్ల మంజూరు కోసం అర్హుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో 2019, 2021 ఇసుక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించింది. వీటి స్థానంలో కొత్త ఇసుక విధానం-2024 అమల్లోకి తీసుకువస్తామని ప్రకటించింది. ప్రస్తుతం నిల్వ కేంద్రాల్లో ఉన్న ఇసుక, పూడిక రూపంలో జలాశయాల్లో ఉన్నది ప్రజలకు సరఫరా చేసేలా నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వానికి ఎటువంటి రాబడి లేకుండా కేవలం సీనరేజ్ ఛార్జి, నిర్వహణ ఖర్చులు మాత్రమే వినియోగదారుల నుంచి తీసుకొని, ఇసుక అందజేయాలని పేర్కొంది. ఇందుకు కలెక్టర్ నేతృత్వంలో ఉండే జిల్లా స్థాయి ఇసుక కమిటీలకు అధికారం కల్పించింది. కేవలం డిజిటల్ చెల్లింపులను మాత్రమే తీసుకుంటూ, ఏ రోజుకు ఆ రోజు ఇసుక నిల్వల వివరాలు వెల్లడిస్తూ పారదర్శక విధానం అమలు చేసేలా ఆదేశాలిచ్చింది. ఇసుక ధర, పర్యవేక్షణ, నిఘా, అక్రమ తవ్వకాలు, రవాణా చేసే వారిపై చర్యలు తదితర వివరాలతో కూడిన మార్గదర్శకాలతో గనులశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.యువరాజ్ నిన్న ఉత్తర్వు జారీ చేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలు, సహజ వనరుల దోపిడీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం త్వరలో శ్వేతపత్రం విడుదల చేయనుంది. దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెలగపూడి సచివాలయంలో మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్‌తో కలిసి ఆయా శాఖల అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఏపీ భూ హక్కు చట్టం, రీసర్వే, విద్యుత్ సంస్థలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు భూముల కేటాయింపు, పేదలకు సెంటు స్థలాలు, రెవెన్యూ వ్యవహారాల్లో వైసీపీ నాయకుల జోక్యంపై అధికారులు రూపొందించిన నివేదికను ఆయన పరిశీలించారు. ఈ నివేదిక సమగ్రంగా లేదని పూర్తి వివరాలతో మరింత సమర్థంగా నివేదిక తయారు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

---------------------------

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పర్యావరణ హితమైన వస్తువుల్ని, ప్రతిమల్ని వాడాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ప్రజలకు పిలుపునిచ్చారు. త్వరలో వినాయక చవితి రానున్న నేపథ్యంలో మట్టి ప్రతిమలను పూజిస్తే పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన నివాసంలో నిన్న ఆయన పర్యావరణ, అటవీ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. మట్టి వినాయక ప్రతిమల్ని పూజించేలా కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

---------------------------

యువతకు అధునాతన పరిజ్ఞానం ఎంతో కీలకమని.. దాన్ని సమగ్రంగా అందించేలా నైపుణ్య విశ్వవిద్యాలయం నెలకొల్పాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటుపై పారిశ్రామికరంగ ప్రముఖులతో ముఖ్యమంత్రి నిన్న హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్కిల్ వర్సిటీ ఏర్పాటుపై అధికారులు, పారిశ్రామిక ప్రముఖుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆర్థికపరమైన అంశాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో.. కరికులమ్, కోర్సులకు సంబంధించి మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించాలని వారికి సూచించారు. ఈ నెలాఖరున జరిగే శాసనసభ సమావేశాలకు ముందే.. ఈ నెల 23వ తేదీ లోపు నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని.. వాటిని పరిశీలించి 24 గంటల్లో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు.

---------------------------

ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు కల్పించడం, తద్వారా పేదరికం లేని రాష్ట్రమే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంత్రి చొరవతో జాతీయ స్థాయి విద్యా సంస్థలు ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన 25 మంది దివ్యాంగ విద్యార్థులు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారిని అభినందించిన లోకేష్ వారందరికీ సొంత ఖర్చుతో ల్యాప్‌టాప్‌లు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సరళమైన ప్రభుత్వం–సమర్థవంతమైన పాలన తమ విధానమని వెల్లడించారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యా విధానంలో సంస్కరణలు తీసుకురావాలన్నది తమ ధ్యేయమని తెలిపారు.

---------------------------

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగించే వారే ఆయన నిజమైన వారసులని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిళ కృషి చేస్తున్నారని తెలిపారు. రాజశేఖరరెడ్డి మరణించి 15 సంవత్సరాలైనప్పటికీ నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని కొనియాడారు. షర్మిల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశ అభివృద్ధి అని వైఎస్ఆర్ బలంగా నమ్మారని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రైతు బజార్లలో కందిపప్పు కిలో 160 రూపాయల చొప్పున విక్రయిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నిన్న ఆయన విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కమిషనరేట్‌లో టోకు వర్తకులు, రైస్‌మిల్లర్లు, సరఫరాదారులతో నిత్యావసర ధరల పెరుగుదలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం పంపిణీ చేయడంపై చర్చించారు. ఈ నెల 11వ తేదీ నుంచి అన్ని రైతు బజార్లలోనూ నిర్ణయించిన రేట్ల ప్రకారమే సరకులు విక్రయించేందుకు వర్తకులు అంగీకరించారు.

---------------------------

తెలంగాణలో కొత్త సామాజిక పింఛన్ల మంజూరు కోసం అర్హుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖల మంత్రి సీతక్క ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగులో ఉన్నవి, తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అందిన దరఖాస్తుల ఆధారంగా నివేదిక ఇవ్వాలని సూచించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ..సెర్ప్ కార్యకలాపాలపై సచివాలయంలో మంత్రి నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. వివిధ పథకాలకు గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లను ఇవ్వకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులను సరిగా వినియోగించుకోలేక పోయామని తెలిపారు. ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన మేరకు చేయూత పథకం కింద పింఛన్ల మొత్తాన్ని ప్రభుత్వం పెంచనుందని.. మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

అగ్నిమాపక శాఖకు అత్యాధునిక పరికరాల కొనుగోలు, ఇతర వసతుల కల్పన కోసం దీర్ఘకాలిక ప్రణాళిక సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. దీని కోసం 15వ ఆర్థిక సంఘం నిధుల్ని వినియోగించుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లా వెలగపూడి సచివాలయంలో నిన్న ఆమె అగ్నిమాపక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖకు సంబంధించిన సమస్యలు, తక్షణ అవసరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

---------------------------

గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆకాంక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని తన క్యాంపు కార్యాలయంలో నిన్న ఆమె పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలు, గిరిజన ప్రాంతాల నుంచి అక్రమంగా తరలివస్తున్న

గంజాయిని అడ్డుకునేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెక్‌పోస్ట్‌ల వద్ద పటిష్ఠమైన తనిఖీలు నిర్వహించాలని, గంజాయి రవాణా నిరోధానికి ప్రత్యేక దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. పిల్లల్లో మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలని, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూడాలని తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంత్రి సూచించారు.

---------------------------

పట్టిసీమ ఎత్తిపోతల పథకంతో కృష్ణా డెల్టా సిరుల సీమగా మారుతుందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా వచ్చిన గోదావరి జలాలు కృష్ణానదిలో కలుస్తున్న సందర్భంగా నిన్న ఆయన జల హారతి ఇచ్చారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దేశ ప్రజలను కరవుకాటకాలు, దుర్భిక్ష పరిస్థితుల నుంచి కాపాడే శక్తి నదుల అనుసంధానానికే ఉంటుందని ప్రఖ్యాత ఇంజనీర్ కె.ఎల్.రావు ఎప్పుడో చెప్పారని.. దాన్ని నిజం చేస్తూ గోదావరి నదిని-కృష్ణానదితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుసంధానించారని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు వృథాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను ఒడిసిపట్టి పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు అందించి.. తద్వారా డెల్టా ఆయకట్టు స్థిరీకరణకు ముఖ్యమంత్రి కృషి చేశారని మంత్రి తెలిపారు.

======================